

రాంసింగ్‌తండా చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

## రాంసింగ్‌తండా చెక్‌పోస్టును తనిఖీ చేసిన నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

సారంగాపూర్, నవంబర్ 17 : సారంగాపూర్ మండలంలోని రాంసింగ్‌తండా వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును మహారాష్ట్రలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులలో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. చెక్‌పోస్టులలో ఇప్పటికీ వరకు సీజ్ చేసిన నగదు, లిక్కర్, ఇతర వస్తువుల వివరాలను సిబ్బంది ఎస్పీ జానకి షర్మిలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామగ్రి చేరవేయడానికి చెక్‌పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నియంత్రించాలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వాహనాల తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ తీసుకోవాలన్నారు. సరిహద్దుల వద్ద ఉన్న చెక్‌పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవసరమైన సదుపాయాల గురించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందులో ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ పరీక్షా కేంద్రంవద్ద క్యూలో నిల్చున్న అభ్యర్థులు

# గ్రూపు-3 ప్రశాంతం



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, నవంబర్ 17 : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు మొదటి రోజైన ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 10,255 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 6,612 మంది రాశారు. 3,643 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 6,581 మంది హాజరు కాగా.. 3674 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో పరీక్షలు ఉండగా.. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1(జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) రాశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 హిస్టరీ, పొలిటికల్ అండ్ సొసైటీ పరీక్ష రాశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి అనుమతించారు. కొందరు ఆలస్యంగా రావడంతో నిబంధనల కారణంగా వారిని పరీక్ష రాసేందుకు సిబ్బంది నిరాకరించారు. అభ్యర్థులు స్వయంగా కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్ల బోసుకున్నారు. ఆయన కూడా ససేమిరా అనడంతో నిరాశతో వెనుదిరిగారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం వేర్వేరుగా సందర్శించారు.

### నిర్మల్‌లో..

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 17 : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని చాణ్య, సేయింట్ థామస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా సమయంలో పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకూడదని పేర్కొన్నారు. మొదటిరోజు ఉదయం జరిగిన గ్రూప్-3 పరీక్ష పేపర్-1 పరీక్షకు జిల్లా కేంద్రంలోని 24 కేంద్రాల్లో 8,124 అభ్యర్థులకు 4,710 (57.98 శాతం) మంది హాజరు కాగా.. 3,414 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. పేపర్-2 పరీక్షకు 8,124 మంది అభ్యర్థులకు 4,690 మంది హాజరు కాగా.. 3,434 మంది గైర్హాజరయ్యారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డిపార్ట్‌మెంట్ అధికారి రాథోడ్ సుదర్శన్, పట్టణ తహసీల్దార్ రాజు ఉన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

## కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 17 : గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను ఎస్పీ జానకి షర్మిల సందర్శించారు. నిర్మల్ పట్టణ కేంద్రంలో పలు కేంద్రాలలో పరీక్ష సరళిని, పరీక్షాకేంద్రాలలో వసతులు, సీసీ కెమెరారాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులందరు నిర్ణీత సమయాని కంటే ముందే కేంద్రాల వద్ద ఉండాలని సూచించారు. పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చూడాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాల వద్ద సెక్షన్ 163, బీఎన్ఎస్ఎస్ (144సెక్షన్) అమలు చేస్తున్నామన్నారు. కేంద్రాల తనిఖీల్లో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# చిన్న చేప

### పరిమాణం తగ్గిన చేప పిల్లలు



కడెం ప్రాజెక్టులో లెక్క వేయకుండానే చేపపిల్లలను వదులుతున్న సిబ్బంది

- 100 మిల్లీమీటర్లకు 40 ఎంఎం.. ● 237 లక్షలకు కేవలం 123 లక్షలే పంపిణీ
- చేప పిల్లలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్
- అధికారులు, కాంట్రాక్టర్ అన్యాయం చేస్తున్నారంటూ మండిపాటు
- అన్యాయం జరిగితే జిల్లా కార్యాలయాన్ని ముట్టడిస్తాం : మత్స్యకారులు



కడెం ప్రాజెక్టులో పోసేందుకు తీసుకొచ్చిన చిన్న సైజ్ చేప పిల్లలు

కడెం, నవంబర్ 17 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా 648 జలాశయాలు, చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో కేవలం 324 చెరువుల్లోనే చేప పిల్లలను విడుదల చేశారు. 237 లక్షలకు కేవలం 123 లక్షలను పంపిణీ చేసినట్లు అధికారుల లెక్కలు చెపుతున్నాయి. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ద్వారా ఏర్పాటు చేశారు. కడెంతోపాటు, దస్తురాబాద్, ఖానాపూర్, పెంబి మండలాల పరిధిలోని సొసైటీ సభ్యులు ఈ ప్రాజెక్టులో వేట సాగించి జీవిస్తారు. జిల్లాలో అతిపెద్ద జలాశయమైన కడెం ప్రాజెక్టులో 18.34 లక్షలే లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు కేవలం 9.17 లక్షలు మాత్రమే పోసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇవి పూర్తిస్థాయిలో వేయలేదని, తప్పుడు లెక్కలు చూపుతున్నట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం 80 నుంచి 100 మిల్లీ మీటర్ల సైజులో పిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా.. కేవలం 30 నుంచి 40 ఎంఎం సైజ్ గల చేప



పిల్లలను పంపిణీ చేశారు. ఇవీ చెరువుల్లో వేసిన రోజే మృత్యువాత పడడంతోపాటు, ఇతర జీవులకు ఆహారంగా అవుతాయని, గుత్తేదారు లాభపేక్ష కోసమే తప్పా.. ఈ చిన్న సైజ్ పిల్లల వల్ల తమకు ఉపయోగం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌ను అడిగితే అధికారుల అనుమతితోనే పంపిణీ చేసినట్లు చెబుతున్నాడు. అధికారులు, కాంట్రాక్టర్ కలిసి తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నారు.

### పూర్తిస్థాయిలో పంపిణీ చేయరు..



కడెం ప్రాజెక్టుతో పాటు, చెరువులు, కుంటల్లో చేప పిల్లల పంపిణీ పూర్తిస్థాయిలో పోయడం లేదు. గతంలో లక్ష్యం మేరకు పంపిణీ చేసిన అధికారులు ఈ ఏడాది కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుతో కడెంతోపాటు, బిర్సాయిపేట్‌లో కూడా వేయాల్సి ఉంది. అక్కడ పంపిణీ చేయలేదు. అలాగే మండలాల్లో రాత్రి పూట తక్కువ పిల్లలను తీసుకొచ్చి తమకు సమాచారం లేకుండానే వేసి వెళ్లిపోతున్నారు. ఈ కార్యక్రమం కేవలం కాంట్రాక్టర్ కోసమే చేపట్టినట్టు ఉంది. లక్ష్యం మేరకు పంపిణీ చేయకపోతే తమ సొసైటీ సభ్యులతో కలిసి జిల్లా కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

*- జుంబర్తి రాజన్న, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, దస్తురాబాద్.*



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

## లంబాడీ గిరిజన రైతులను వేధించడం మానుకోవాలి

ఉట్నూర్, నవంబర్ 17 : కొండగల్ నియోజకవర్గంలోని లంబాడీ గిరిజన రైతులను వేధించడం మానుకోవాలని మాజీ జడ్పీటీసీ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఫార్మాసిటీ పేరిట లంబాడా గిరిజనులపై ప్రభుత్వం చేస్తున్న దాడులకు గాను నల్లబ్యాడ్జీలతో బంజారా నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయంగా కలెక్టర్ తనపై దాడి జరగలేదని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం లంబాడీ రైతులపై కక్ష కట్టిందన్నారు. ఫార్మాసిటీకి భూములను తీసుకోవాలని, వారిని జైలుకు తరలించి కేసులు నమోదు చేస్తుందన్నారు. వెంటనే వారిని విడుదల చేయడంతోపాటు కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు భరత్ చౌహన్, ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, నాయకులు బానోత్ రామారావు, బంజారా నాయకులు శ్రీరాంనాయక్, రాందాస్, గణేశ్, రవి, దినేశ్, గంగారాం, దిగంబర్, అజయ్, నాను, రవీందర్, నూర్‌సింగ్, ప్రకాశ్, దత్తారాం, లాల్‌సింగ్, వసంత్, శ్రీకాంత్, నగేశ్, నాను, సంతోష్, రమేశ్‌లు పాల్గొన్నారు.



నార్నూర్‌లోని గాంధీ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న లంబాడీ గిరిజనులు

### కేసులను ఎత్తివేయాలి..

నార్నూర్, నవంబర్ 17 : సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో గిరిజనులపై దాడులు చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని లంబాడీ గిరిజనం ఖండిస్తున్నామని నార్నూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద లంబాడీ గిరిజనుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నాలు మానుకోవాలని, తన అల్లుడి కోసం అమయాక గిరిజనులను వేధిస్తున్న రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో వందల ఎకరాలు భూములు ఉన్న రెడ్డి, రావులకు సంబంధించిన భూములను లాక్కొని కంపెనీ ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, ప్రకాశ్, మోహన్, మహేందర్, గణేశ్, రాథోడ్ శివాజీ పాల్గొన్నారు.

# తోడు కోసం..

- ఆడ పులి కోసం తిరుగుతున్న మగ పులి
- రెండు రోజులుగా పెంబి మండలంలో అన్వేషణ
- గేదె, దూడలపై దాడి.. నీటి కాలువ వద్ద పాదముద్రల గుర్తింపు
- భయాందోళనలో మారుమూల గ్రామాల ప్రజలు

ఉట్నూర్/ఉట్నూర్ రూరల్, నవంబర్ 17 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో పులి సంచరిస్తున్నది. రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లా పెంబి మండలంలో గేదె, దూడపై దాడి చేసిన విషయం తెలిసిందే. తాజాగా పెంబి మండలంలోని దొందారిల మీదుగా మండలంలోని వంకతుమ్మ ప్రాంతానికి వచ్చి చాకటి జంగుకి చెందిన ఎద్దుపై దాడి చేసింది. ఆదివారం ఉదయం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లోకి ప్రవేశించి.. మధ్యాహ్నం రాజులుగూడ గ్రామంలో మరో ఎద్దుపై దాడి చేసింది. ఆదివారం ఉదయం చేలలోకి వెళ్తున్న గ్రామస్తులకు నీటి కాల్వలో పులి పాద ముద్రలుగా అనుమానం రావడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు గ్రామానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి పులివిగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత చాందూరి పంచాయతీ పరిధిలోని రాజులుగూడ గ్రామానికి చెందిన కుంర ఆనంద్‌రావుకు చెందిన ఎద్దుపై దాడి చేసింది. అక్కడి నుండి నార్నూర్ జామ్డ గ్రామం వైపు పులి వెళ్లినట్టుగా అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

### ఆడ పులి అన్వేషణలో..

నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని అటవీ ప్రాంతంలో మగ పులి సంచరిస్తూ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోకి ప్రవేశించింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి అటవీ ప్రాంతంలో గల ఆడపులి కోసం అన్వేషిస్తూ గురువారం పెంబి ప్రాంతం నుంచి ఆదివారం ఉట్నూర్ మండలం చేరుకున్నది. ఇక్కడి నుంచి నార్నూర్ మండలంలోని జామ్డ వెళ్లిన్నట్లు తెలుస్తుంది. అక్కడి నుంచి కెరమెరి అటవీ ప్రాంతంలోకి వెళ్లే అవకాశం ఉంది. పెద్ద పులి సంచరిస్తున్నందున మారుమూల గ్రామ ప్రజలు రెండు రోజులు చేలలోకికి వెళ్లొద్దు. అదేవిధంగా సోలార్, విద్యుత్ తీగలు అమర్చడం వంటివి చేయకూడదు. ఒక వేళ విద్యుత్ తీగలు అమర్చి పులికి హానీ జరిగితే వన్యప్రాణి రక్షణ చట్టం ప్రకారం జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. పులి జాడలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

*-ఎఫ్ఆర్‌వో ప్రజ్ఞాజాడే శీలానంద్*



నాగాపూర్‌లో పులి పాద ముద్రలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎఫ్ఆర్‌వో ప్రజ్ఞాజాడే శీలానంద్



న్యూ లోలం కొనుగోలు కేంద్రంలో తూకం వేసి లారీల కోసం ఉంచిన ధాన్యం బస్తాలు

# కుప్పలు.. తెప్పలు

### లారీలు రాకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం

దిలావర్‌పూర్, నవంబర్ 17 : న్యూలోలం, దిలావర్‌పూర్, గుడంపల్లి, సాంగ్వీ, సిర్గాపూర్, బన్సపల్లి, కాల్వ గ్రామాల్లో నెల రోజుల క్రితం రైతు సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు చేసి సంచుల్లో నింపారు. లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం సంచులు ఉన్నాయి. మరికొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం వేయక పోవడంతో ధాన్యపు రాశులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, వారికి అండగా నిలుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.